సాక్షి ఒడిశా
సోమవారం । 15 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,53,366, బంగారం 2.5 గ్రాములు, వెండి 9.2గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అమ్మకు వందనం

- 8లో

ఎవరా ముగ్గురు?

- ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న ఎస్టీఎఫ్



- 8లో

న్యూస్‌రీల్

సీఎంతో దీపాలీ దాస్ భేటీ



ఝార్సుగుడ నియోజకవర్గ ఎమ్మెల్యే దీపాలీ దాస్ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో ఆదివారం భేటీ అయ్యారు. ఇటీవల ముగిసిన ఝార్సుగుడ ఉప ఎన్నికలో బిజూ జనతాదళ్ అభ్యర్థిగా దీపాలీ దాస్ ధీటైన పోటీనిచ్చి, ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌తో ఆయన నివాసంలో కలిశారు. దీపాలి విజయం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేసి, ప్రత్యేకంగా అభినందించారు. – భువనేశ్వర్

మహంత సీతారాం దాస్ అంతిమదశ యాత్ర



అంతిమదశ యాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పర్లాకిమిడి: పట్టణంలోని దేవీమఠం మహంత మహారాజ్ సీతారాం దాస్(82) అంతిమదశ యాత్ర ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా చేపట్టిన నగర పరిక్రమలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కైలాష్ గౌడో, మనోజ్ దాస్, లోకనాథ మిశ్రా, భక్తులు పాల్గొన్నారు. ఈనెల 3న సీతారాం దాస్ స్థానిక దేవీమఠంలో వృద్ధాప్య అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.

చెట్లు ధ్వంసం కేసులో ముగ్గురి అరెస్ట్



చెట్ల మొదళ్లను తగులబెట్టిన దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లు ధ్వంసం వేస్తున్నారనే ఆరోపణలపై ముగ్గురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. నిందితులు శంకరడ పంచాయతీ డిమురిడ గ్రామానికి చెందిన బృందా మాఝి(43), లాదీ మాఝి(32), దొభలా జొడియా(29)గా గుర్తించారు. గత కొద్ది రోజులుగా కాసీపూర్ అటవీరేంజ్ పరిధి విలువైన చెట్లు అంతరించడంతో పాటు కొందరు చెట్ల మొదళ్లలో నిప్పుపెట్టి, తగులబెడుతున్నారు. గమనించిన అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. కాసీపూర్ అటవీశాఖ రేంజర్ దివ్యమాధురి శెఠి, ఫారెస్టర్ ఎంకిన సాబొరా వివరాలను తెలియజేశారు.

సామూహిక ఉద్యమంతోనే నివారణ

- బాల్య వివాహాలు, లైంగిక వేధింపులపై చైతన్య శిబిరంలో వక్తలు



చైతన్య శిబిరంలో పాల్గొన్న అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు

జయపురం: పట్టణానికి చెందిన చైల్డ్‌ఫండ్ విభాగం ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు హోటల్‌లో బాల్య వివాహాలు, వేధివులపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వివిధ పంచాయతీల ప్రతినిధులు, శిశు సంక్షేమశాఖ అధికారులు బాలల రక్షణకు అమలులో ఉన్న చట్టాలు, బాధితులకు లభించే సాయం, రక్షణ పై చర్చించారు. ఈ సందర్భంగా చైల్డ్‌ఫండ్ అధికారి జస్మిత మహంతి మాట్లాడుతూ సామూహిక ఉద్యమం ద్వారానే బాల్య వివాహాలు అరికట్టవచ్చని తెలిపారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. తక్కువ వయస్సు పిల్లలకు మానసిక, శారీరక పరివర్తన ఉండదని, లేత వయస్సులో పెళ్లి చేయడం వల్ల ఆరోగ్యపరంగా కూడా సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వం కనీస వివాహ వయస్సు నిర్ధారించిందని స్పష్టంచేశారు. అలాగే బాలలపై శారీరక, మానసిక వేధింపులు, అవమానకర ఘటనలు ఎన్నో ఉన్నాయని, అవి చట్టపరంగా శిక్షార్హమని గుర్తుచేశారు. తల్లిదండ్రులు చైతన్యవంతులైతే, అటువంటి వాటిని నిరోధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టంకువ పంచాయతీ సర్పంచ్ రుక్మిణీ గదబ, రొండాపల్లి పంచాయతీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యం..!

- కొందమాల్ జిల్లా బంద్‌కు మావోయిస్టుల పిలుపు
- రోడ్డుకు అడ్డంగా చెట్లు నరికివేసి నిరసన
- కళింగ ఘాటీలో నిలిచిన వాహనాల రాకపోకలు



బంద్ పిలుపుతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న కళింగా ఘాట్

బరంపురం: కొందమాల్ జిల్లాలో బంద్ చేపట్టనున్న పిలుపునిస్తూ మావోయిస్టులు ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో కొందమాల్ జిల్లా బల్లిగుడా పోలీసు స్టేషన్ పరిధి సిమన్‌బడి అటవీ ప్రాంతలో ఆదివారం ఉదయం భారీ చెట్లను నరికి, రహదారికి అడ్డంగా పడవేశారు. దీంతో కొందమాల్–గంజాం–రాయగడ–గజపతి జిల్లా మధ్య వాహనాల రాకపోకలు నిలచిపోయాయి. జిల్లాలోని పుల్బణి పట్టణానికి వెళ్లే 59నంబర్ జాతీయ రహదారిలోని వివిధ ప్రాంతాల్లో మావోయిస్టులకు సంబంధించి వివిధ పోస్టర్లు, బ్యానర్లు దర్శనమివ్వడంతో స్థానికంగా కలకలం రేపింది. 3రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ లోని దంతెవాడ జిల్లాలో సీఆర్‌పీఎఫ్ జవాన్లతో జరిగిన ఎదురు కాల్పుల్లో పలువురు మావోయిస్టులు మృతి చెందిన ఘటనకు వ్యతిరేకంగా ఈనెల 15వరకు బంద్ చేపట్టనున్నట్లు పోస్టర్లలో పేర్కొన్నారు. అలాగే తమ12 డిమాండ్లను సైతం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న బల్లిగుడా పోలీసులు బ్యానర్లను స్వాధీనం చేసుకోవడం తోపాటు స్థానికులను అప్రమత్తం చేశారు.

జోరుగా కూబింగ్..

మావోయిస్టుల దుర్గంగా ఉన్న కొందమాల్ జిల్లాలో బంద్‌కు పిలుపునివ్వడం, రోడ్డుకు అడ్డంగా భారీ చెట్లను నరికి వేయడంతో ఆ మార్గంలో రాకపోకలు ప్రభావితమయ్యాయి. సమాచారం అందుకున్న సీఆర్‌పీఎఫ్, ఎస్‌ఓజీ జవాన్లు, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఒకవైపు రహదారిపై పడి ఉన్న చెట్లను తొలగిస్తునే.. మరోవైపు కూబింగ్ ముమ్మరం చేశారు. జిల్లా పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అటవిలో అనువనువూ జల్లెడ పడుతున్నారు. వచ్చి, పోయే వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కళింగా ఘాటీపై చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు.

ముందస్తు చర్యగా..

మావోయిస్టుల జిల్లా బంద్ పిలుపు నేపథ్యంలో విధ్వంసకర చర్యలకు పాల్పడవచ్చనే అనుమానంతో ముందస్తు చర్యగా బరంపురం ఓఎస్ ఆర్‌టీసీ డిపోలో కొందమాల్ జిల్లా వైపు బస్సు సర్వీసులను నిలిపి వేసినట్లు ఆశాఖ డీఎం అమయ్ మిశ్రా తెలిపారు. దీంతో ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే సర్వీసులు కూడా నిలిచిపోయాయి.



కొందమాల్-సిమన్‌బడి రహదారిలో చెట్లు నిరికి వేసిన మావోయిస్టులు



కొందమాల్-గంజాం సరిహద్దులో కూబింగ్ చేపడుతున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు



బరంపురం డిపోలో నిలిచిన ఓఎస్ ఆర్‌టీసీ బస్సులు

మారుమూల ప్రాంతాల్లో మెరుగైన సేవలు



నవరంగపూర్ జిల్లాకు బయల్దేరిన వైద్య నిపుణుల బృందం

భువనేశ్వర్: రాష్ట్రం నలుమూలల మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ సంకల్పించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి వాయు స్వాస్థ్య సేవాయోజన(సీఎంవీఎస్‌వై) ప్రారంభించింది. మారుమూల ప్రాంతీయులకు నాణ్యమైన వైద్య సేవలు కల్పించేందుకు ఈ పథకం నిరంతరం కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక వైద్య నిపుణుల బృందం నవరంగపూర్ జిల్లాకు ఆదివారం బయల్దేరింది. అక్కడి జిల్లా ప్రధాన ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించే ప్రత్యేక శిబిరంలో స్థానికంగా వైద్య, చికిత్స సదుపాయాలు పొందని ప్రమాదకర రోగాల నిర్ధారణ, చికిత్స, వైద్య సేవలను బాధిత వర్గాలకు ఈ బృందం అందజేస్తుంది. ఈనెల 17వరకు శిబిరం నిరవధికంగా కొనసాగనుంది. వైద్య నిపుణుల బృందంలో యూరాలజీ(డాక్టర్ బిశ్వజిత్), లాప్రోస్కోపిక్ సర్జరీ(డాక్టర్ జ్యోతిర్మయ నాయక్), నెఫ్రాలజీ(డాక్టర్ చిన్మయానంద), హెపటాలజీ(డాక్టర్ జ్ఞాన), కార్డియాలజీ(డాక్టర్ ప్రవీణ్ జైస్వాల్) తదితర నిపుణులు ఉన్నారు.

30యూనిట్ల రక్తం సేకరణ



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: పట్టణంలోని సత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వేసవి స్వతంత్ర రక్తదాన శిబిరంలో 30 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. మహాత్మాగాంధీ రోడ్డులోని సత్యసాయి మందిరం ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరాన్ని జయపురం రక్తనిధి కేంద్రం అధికారి డాక్టర్ సూర్యశేఖర మిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం బృహత్తర దానమన్నారు. దీనివల్ల అనేకమంది ప్రాణాలు కాపాడవచ్చని సూచించారు. యువత స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొని, ప్రాణదాతలుగా నిలవాలని ఆకాంక్షించారు. సత్యసాయి సేవాట్రస్టు అధ్యక్షుడు రమేష్ గుప్తా మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ రమేష్ గుప్తా, జిల్లా సర్వీస్ కో–ఆర్డినేటర్, కె.మోహనరావు ఆచారి, జిల్లా అధ్యక్షుడు, కేఎం షరాబు, డీఎస్ మాలి, జిల్లా సర్వీస్ కో–ఆర్డినేటర్ వెంకటరావు, ఎన్‌కే రావు, ఎస్ఎన్ రథో, ఎస్.రవిశంకర్, ఏకే పాత్రొ(రాజాబాయి), సాయికుమార్, మృత్యంజయ పట్నాయక్, మనీష్ దాస్, ఎ.జగన్, శ్రీనివాస, కామేశ్వరరావు, వి.మోహనరావు, ఎ.సుశీల, పుష్పాంజలి రథొ తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో 'కర్ణాటక' విజయోత్సవాలు



పార్టీ కార్యాలయంలో విజయోత్సవాల్లో కాంగ్రెస్ శ్రేణులు

జయపురం: కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో జయపురంలోని ఆ పార్టీ శ్రేణుల్లో ఆనందం ఉప్పొంగింది. ఈ మేరకు స్థానిక పట్టణంలోని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ భవనంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి మాట్లాడుతూ బీజేపీ అవలంభిస్తున్న మత, వర్గ రాజకీయాలకు కర్ణాటక ప్రజలు చరమగీతం పాడారన్నారు. దేశంలో మోదీ పాలన పతనానికి ఇది నాంది కాగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. మత మౌఢ్యంతో ప్రజలను ఎంతోకాలం అంధకారంలో ఉంచలేరని, చైతన్యవంతులై కర్ణాటక ఓటర్ల తరహాలో తగిన గుణపాఠం చెబుతారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశాతో పాటు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు పంచుకొని, సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కోశాధికారి నిహారంజన్ బిశాయి, సహాయ కార్యదర్శి వెంకటరావు పట్నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనుల జీవనశైలే.. జగన్నాథ సంస్కృతి



వేదికపై సీఎం, మంత్రులు, అధికారులు



సంప్రదాయ గిరిజనులను సత్కరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

- సీఎం నవీన్ పట్నాయక్
- 14 జిల్లాల్లో ప్రత్యేక అభివృద్ధి మండలి ప్రారంభం
- ఆదివాసీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటన

భువనేశ్వర్: 'ఒడిశా జగన్నాథుని క్షేత్రం. జగన్నాథ సంస్కృతి గిరిజనుల జీవనశైలిగా అడుగడుగున ప్రతిబింబించడం విశేషం. జగన్నాథుని సంస్కృతితో వీరికి గాఢమైన అనుబంధం ఉన్నట్లు తారస పడుతుంది. ప్రకృతి, పర్యావరణానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. గిరిజన సంస్కృతిలో ప్రకృతి ఆరాధన, సోదరభావం, పర్యావరణ పరిరక్షణ ప్రధానాంశాలు. స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి తరం రాజకీయాల వరకు రాష్ట్ర గిరిజనుల ప్రాధాన్యత అనన్య'మని సీఎం నవీన్ పట్నాయక్ కొనియాడారు. రాష్ట్రంలో గిరిజనుల ప్రత్యేక అభివృద్ధికి 14జిల్లాల్లో కొత్తగా ప్రత్యేక అభివృద్ధి మండలిని(ఎస్‌డీసీ) నవీన్ పట్నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ జాబితాలో అనుగుల్, బొలంగీర్, బాలేశ్వర్, బర్‌గడ్, బౌధ్, దేవ్‌గఢ్, ఢెంకనాల్, గంజాం, జాజ్‌పూర్, ఝార్సుగుడ, కలహండి, నువాపడా, నయాగఢ్, సంబల్‌పూర్ జిల్లాలు ఉన్నాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... అభివృద్ధి నిర్వహణలో కళ, సంస్కృతి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నాయని తెలిపారు. గిరిజనుల లోగిళ్లలో అపురూప కళా సంస్కృతులు సురక్షితంగా పరిరక్షిస్తున్నారని కొనియాడారు. ఈ సంప్రదాయ పరిరక్షణకు ప్రభుత్వం మరింత అండగా నిలిచేందుకు ప్రత్యేక అభివృద్ధి మండలి ఏర్పాటుకు నడుం బిగించిందని ప్రకటించారు. రాష్ట్రంలో 62 గిరిజన తండాలు ఉన్నాయని, సంబంధిత జిల్లాల్లో ప్రతి మండలంలో వారి సంస్కృతిని పరిరక్షించడం ఎస్‌డీసీల బాధ్యతగా పేర్కొన్నారు. ఈ దిశలో ఆయా ప్రాంతాల్లో అన్ని మండలాల్లో సాంస్కృతిక రక్షణ ప్రత్యేక అభివృద్ధి మండలి లక్ష్యంగా వివరించారు.

172 మండలాల్లో..

2018 నుంచి రాష్ట్రంలో ఎస్‌డీసీలు పని చేస్తున్నాయి. అయితే ఈ కార్యకలాపాలు 9 జిల్లాలకు పరిమితమయ్యాయి. వీటి కార్యకలాపాలు 60లక్షల మంది గిరిజనులకు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. కొత్తగా ఏర్పాటైన ఈ ప్రత్యేక అభివృద్ధి మండలిలో 172 మండలాల నుంచి 80లక్షల మందికి పైబడి గిరిజన సోదరులు, సోదరీమణులు పాత్రధారులుగా పాలుపంచుకుంటారు. గిరిజన, కళలు, సంస్కృతి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24లో రూ.223 కోట్లు వెచ్చిస్తుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో విస్తరణ పురస్కరించుకుని తాజాగా 14 జిల్లాల్లో ఎస్‌డీసీలు ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. గిరిజనుల కళలు, సంస్కృతి పట్ల అన్ని వర్గాల్లో ఆసక్తి ఇమిడి ఉంటుందని, స్థానిక గిరిజన మ్యూజియం ఒక ముఖ్యమైన పర్యాటక ఆకర్షణగా వెలుగొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక అభివృద్ధి మండలి గిరిజనులకు సాధికారత బలోపేతానికి దోహదపడుతుందని తెలిపారు.

సంస్కృతి పరిరక్షణకు..

స్థానిక ఆదివాసీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కొత్త ఎస్‌డీసీల ప్రారంభోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బహిరంగ సభలో షెడ్యూల్డ్ కులాలు, తెగలశాఖ మంత్రి జగన్నాథ్ సరక, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా, 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్, గిరిజన అభివృద్ధి మండలి సలహాదారు ప్రదీప్ మాఝీ, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల గిరిజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర జనాభాలో 22శాతానికి పైగా గిరిజనులు ఉండగా.. వారి సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసినట్లు వీరంతా ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాఫీ టేబుల్ బుక్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు.

సామాజిక కార్యకర్త దారుణ హత్య

- ఆశా సేవాసంస్థ డైరెక్టర్‌ను కాల్చి చంపిన దుండగులు
- గుణుపూర్‌లో వంశధార వంతెనపై ఘటన



గౌరీ మిశ్రా(ఫైల్)



వంశధార వంతెనపై గౌరీ మృతదేహం



ఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌కు చెందిన ఆశా స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ గౌరీ మిశ్రా(54) శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు ఆయనను అతి సమీపం నుంచి తుపాకీతో కాల్పులు జరపడంతో అక్కడిక్కడే కుప్పకూలి పోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మిశ్రాను గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించారు. తనిఖీ చేసిన వైద్యులు.. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్ ఐఐసీ నీలాంబర్ జాని వివరాలను ఆదివారం వెల్లడించారు. రోజూ రాత్రి భోజనం అనంతరం గౌరీ మిశ్రా, కొంతమంది మిత్రులు కలిసి సమీపంలోని వంశధార నది వంతెన వద్దకు బైక్‌పై వెళ్లి, కొద్దిసేపు గడిపి తిరిగి వస్తుంటారు. ఎప్పటిలాగే శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో అంతా వంతెనకు చేరుకోగా.. మరికొంత సమయం ఉండి వస్తానని మిశ్రా చెప్పడంతో మిగతా వారంతా ఇళ్లకు తిరిగి వెళ్లారు. కొద్ది సేపటికి కొంతమంది దుండగులు బైకుపై వచ్చి, తుపాకీతో అతి సమీపం నుంచి అతనిపై 3 రౌండ్లు కాల్పులు జరిపారు.

దర్యాప్తు ముమ్మరం..

గౌరీ మిశ్రా గత కొన్నాళ్లుగా ఆశా అనే స్వచ్ఛంద సేవాసంస్థకు డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. అంతకుముందు పాత్రికేయుడిగా పనిచేసిన ఆయన.. డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండటంతో పాత్రికేయ వృత్తి వీడారు. ఆశా తరఫున పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ స్థానికంగతా ఆదరాభిమానాలు సంపాదించుకున్నారు. ఈ క్రమంలో ఈ దారుణ హత్యకు గురికావడం స్థానికంగా పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ దారుణ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గుణుపూర్ పరిసర ప్రాంతాలను అప్రమత్తం చేశారు. హత్యకు సంబంధించి ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటనలో మావోయిస్టుల ప్రమేయం ఉందా? గిట్టని వారు ఎవరైనా ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారా అని అనుమానిస్తున్నారు. పూర్తి ఆధారాలు సేకరించిన అనంతరం హత్యకు గల కారణాలను వెల్లడిస్తామని పోలీసులు స్పష్టంచేశారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బూర్లె మహేష్(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అప్పయ్యపేట గ్రామ సమీపంలో ఈ నెల 9న మనస్తాపంతో పురుగు మందు తాగేసిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై నారాయణరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామతీర్థం గ్రామానికి చెందిన స్వాతితో శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలంలోని అర్జునవలస గ్రామానికి చెందిన బూర్లె మహేష్(27)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. నాటి నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా తరచూ గొడవలు జరుగుతుండేవి. భార్య స్వాతితో పాటు కుటుంబ సభ్యులు ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం ఈ నెల 8న మహేష్ స్టేషన్‌కు హాజరు కాగా..అక్కడ జరిగిన గొడవతో మనస్తాపానికి గురై మరుసటి రోజు అప్పయ్యపేట సమీపంలో ఉన్న టేకు తోటలో పురుగు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పురుగు మందు తాగినట్లు స్నేహితులకు మహేష్ ఫోన్ చేసి చెప్పడంతో అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా..పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి ఏడాది వయసు గల పాప ఉంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన రమ (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన వివాహిత రమ(26) ఆదివారం ఉదయం ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై ఎస్సై ముకుందరావు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం రాకోడు గ్రామానికి చెందిన రమకు ఎల్.కోట మండలం మార్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల చిన్నంనాయుడుతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితంలో 5 సంవత్సరాల పాప, 3 సంవత్సరాల వయస్సు గల బాబు ఉన్నారు. కాగా రమ భర్త చిన్నంనాయుడు విశాఖపట్నం ఉద్యోగ నిమిత్తం వెళ్లగా శనివారం రాత్రి ఇంటిలో ఆమె ఒక్కతే పడుకుంది. ఆదివారం తెల్లవారాక చూసేసరికి ఉరికి వేలాడి కనిపించింది. వెంటనే స్థానికులు ఎల్.కోట పోలీసులకు సమాచారం అందజేయగా ఘటనా స్థలానికి ఎస్సై ముకుందరావు సిబ్బందితో కలిసి వచ్చి పరిశీలించారు.

వేధింపులే కారణం

తన కూతురు చావుకు అల్లుడు, అత్త, మామల వేధింపులు, శారీరకంగా హింసించడం, అల్లుడు చిన్నంనాయుడికి వివాహేతర సంబంధం ఉండడం కారణాలు. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై భర్త దాడి


చికిత్సపొందుతున్న ఆదిలక్ష్మి

పార్వతీపురం: వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో ఓ భర్త, భార్యపై దాడి చేసి తీవ్రంగా ఆదివారం గాయపరియాడు. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని వేమకోటివారి వీధికి చెందిన కె. ఆదిలక్ష్మి శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో భర్త కృష్ణ అనుమానంతో కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో ఆదిలక్ష్మికి ముఖంపై పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆదిలక్ష్మిని కుమారుడు ద్విచక్రవాహనంపై చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

జామి: మండలంలోని అలమండ గ్రామం సమీపంలో చెరువు వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జామి ఎస్సై వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో మొత్తం నలుగురు పేకాట రాయుళ్లను పట్టుకుని రూ.22,620 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పేకాట రాయుళ్లపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సాలూరు: 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర 104 ఎమ్ఎమ్‌యూ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఉపముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలోని ఆయన గృహంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 104,ఎమ్ఎమ్‌యు వాహన ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పిస్తామని, వేతనాల పెంపు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తమను ఆప్కాస్/కాంట్రాక్ట్‌లో అబ్జార్బ్ చేసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అమ్మకు వందనం

- ఘనంగా అంతర్జాతీయ మాతృదినోత్సవం


తల్లులకు పూజ చేస్తున్న చిన్నారులు


మాతృ దినోత్సవంలో మహిళలు, శిక్షకులు


మాట్లాడుతున్న గీతారాణి పాల్


వేదికపై రాజ్యసభ సభ్యుడు మున్నా ఖాన్, కలెక్టర్ కమలోచన్ మిశ్రా

పర్లాకిమిడి: అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి జిల్లా కేంద్రంలోని గజపతి ప్యాలెస్ యూటెక్ కంప్యూటర్స్ కార్యాలయంలో ద్వితీయ మహిళా ప్రగతి సంఘటన్ సంస్థ వార్షికోత్సవాన్ని జరుపుకొన్నారు. సంస్థ కార్యదర్శి తనూజా శత్పతి, అధ్యక్షుడు కల్పనా పట్నాయక్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థినులకు మోనో యాక్షన్, డ్యాన్స్, అభినయంపై పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా బిచిత్రానంద బెబర్తా వ్యవహరించారు. సీడీఎంఓ డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో, డాక్టర్ రత్నమాల పట్నాయక్, లోకనాథ మిశ్రా హాజరై, మాట్లాడారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించి, అభినందించారు.

తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో..

గజపతి తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో ప్యాలెస్ వీధిలోని అర్బన్ బ్యాంకు గ్రౌండ్స్‌లో మాతృ దినోత్సవాన్ని జరిపారు. అకాడమీ కార్యదర్శి కార్తీక్ మహాపాత్రో, గణేష్‌చంద్ర మహాపాత్రో, అమూల్య పాణిగ్రాహి ఆధ్వర్యంలో చిన్నారుల తల్లులను ఆహ్వానించారు. నిశ్చితా సాహు, మనిషా జెన్నా, గీతారాణి పాల్ తదితరులు అమ్మదనంపై వివరించారు. పలువురు విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేసి, మిఠాయిలు తినిపించడంతో పాటు ఆశీర్వాదం పొందారు.

హాజరైన మున్నా ఖాన్..

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్ శక్తి సమావేశ మందిరంలో ప్రభుత్వం అధికారికంగా కార్యక్రమం నిర్వహించింది. రాజ్యసభ సభ్యుడు, ఒడియా సినీహీరో మని ముల్లాఖాన్(మున్నా) ముఖ్య అతిథిగా హాజరై, మాతృదినోత్సవ ఆశయాలు వివరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా మాట్లాడుతూ సమాజంలో ప్రతి స్త్రీలోనూ మాతృభావనతో చూడాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని తమ అనుభవాలు పాలుపంచుకున్నారు.


పాల్గొన్న తల్లులు, విద్యార్థినులు

ఎవరా ముగ్గురు?

- వివిధ ప్రాంతాల్లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు
- ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న ఎస్‌టీఎఫ్
- ఐఎస్‌ఐతో సంబంధాలు ఉన్నట్లు అనుమానం



భువనేశ్వర్: రాష్ట్ర స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) పోలీసులు సందిగ్ధ గూఢచారులను అరెస్ట్ చేశారు. పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ కార్యకర్తలు, ఐఎస్‌ఐ ఏజెంట్లతో ప్రమేయం ఉందన్న ఆరోపణలపై వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు సందిగ్ధ గూఢచారులు ఉన్నట్లు తెలిపారు. ఒకరు ఐటీఐ టీచర్‌గా, మరో ఇద్దరు నయాగఢ్, జాజ్‌పూర్ జిల్లా వాసులుగా గుర్తించారు. నిందితుల్లో నయాగఢ్ జిల్లా బడాపండుసర్‌కు చెందిన పఠాని సామంత్ లెంక(35), దసపల్లా ప్రాంతానికి చెందిన ఐటీఐ లెక్చరర్ సరోజ్‌కుమార్ నాయక్(26), జాజ్‌పూర్ జిల్లా సుజన్‌పూర్ ప్రాంతానికి చెందిన సౌమ్య పట్నాయక్(19) ఉన్నారు. వీరంతా దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో శత్రు ప్రాంతీయులకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వచ్చిన సమాచారం ఆధారంగా ఆకస్మిక దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఆరోపణలకు అనుబంధ ఆధారాలు లభ్యం కావడంతో చర్యలు చేపట్టారు. అలాగే పలు దస్తావేజులు, సెల్ ఫోన్లు, ప్రీ యాక్టివేట్ చేసిన సిమ్‌కార్డులు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు.

మోసపూరిత కార్యకలాపాలు

నిందితులు మోసపూరితంగా ఇతరుల పేరుతో భారీ సంఖ్యలో సిమ్ కార్డులను సేకరించి శత్రు రాజ్యాల వర్గాలకు రహస్యంగా అందజేస్తున్నారు. సరికొత్త సిమ్‌లు లేదా లింక్ చేసిన వాటిని పాకిస్థాన్, మన దేశంలో తలదాచుకుంటున్న పాకిస్తానీ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లు(పీఐఓ), ఐఎస్‌ఐ ఏజెంట్లతో సహా వివిధ ఖాతాదారులకు విక్రయించినట్లు స్పెషల్ టాస్క్ ఫోర్స్ అధికారుల దాడుల్లో తేలింది. ప్రతిఫలంగా భారత్‌లో ఉన్న కొందరు పాకిస్తానీ ఏజెంట్లు ద్వారా వీరికి లబ్ధిపూర్వక చెల్లింపులు ముట్టినట్లు గుర్తించారు. అంతేకాకుండా వారు గత ఏడాది హనీ ట్రాప్ కేసులో అధికారిక రహస్య చట్టం కింద అరెస్టయిన రాజస్థాన్ మహిళ పాకిస్తానీ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌తో వీరు నిరంతరం సంప్రదింపులో ఉంటున్నట్లు అధికార వర్గాల దృష్టికి వచ్చింది. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాలో వివిధ ఖాతాలు, ఛానెల్‌లను సృష్టించడానికి, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ షాపింగ్ సైట్‌లలో ఓటీపీ లావాదేవీలు బయటపడ్డాయి. ఈ-మెయిల్ ఖాతాల్లో ఉత్తర ప్రత్యుత్తరాల దాఖలాలు స్పష్టమయ్యాయి. ఈ ఖాతాల్లో అత్యధికంగా మన దేశానికి చెందినవి కాదు. పాకిస్థానీ వర్గీయులుగా భావిస్తున్నారు.

సామగ్రి స్వాధీనం..

పట్టుబడిన ముగ్గురూ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు గూఢచర్యం, టెరరిస్టులతో కమ్యూనికేషన్, రాడికలైజేషన్, భారత వ్యతిరేక ప్రచారాన్ని నడపడం, భారత వ్యతిరేకతను పెంచడం, సోషల్ మీడియాలో విభజన భావాలు, సెక్స్‌టార్షన్, హనీ ట్రాపింగ్ వంటి వివిధ రకాల భారత వ్యతిరేక కార్యకలాపాలలో ఉపయోగించినట్లు ఆధారాలు లభించాయి. ఈ ఖాతాలు భారతీయుల వివరాలతో నమోదు చేయడంతో సాధారణ వర్గాల్లో ఏమాత్రం సందిగ్ధత తలెత్తకుండా మోసాల ముసుగులో శత్రు రాజ్యాల ప్రతినిధులతో విచ్చలవిడిగా లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు, భారత వ్యతిరేక వర్గాల సౌకర్యానికి అనుకూలంగా వస్తువులను సరఫరా చేయడానికి ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫాంలలో భారతీయ పరిచయాలతో తెరిచిన ఖాతాలు వినియోగించినట్లు గుర్తించారు. వివిధ రకాల నేరాలలో వీటిని ఉపయోగించినట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర స్పెషల్ టాస్క్‌ఫోర్స్ చేపట్టిన దాడుల్లో 19 ఖరీదైన సెల్‌ఫోన్లు, 47 సిమ్‌కార్డులు, 61 ఏటీఎం కార్డులు, 23 సిమ్ కవర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కరాటే పోటీల్లో రాజాం విద్యార్థుల సత్తా

రాజాం: మాస్టర్ సాయిబాబా మెమోరియల్ నేషనల్ లెవెల్ కుంగ్-ఫూ అండ్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో రాజాం పట్టణానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఫస్ట్ నేషనల్ లెవెల్ పోటీలు జరగగా రాజాం కరాటే అకాడమీకి చెందిన హేమకేష్, తన్విక, రిషిక, శ్రీకరణ్‌లు కుమితీ ఫైటింగ్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. కాటా విభాగంలో సూర్యచంద్ర, శ్రీజ్ఞానవిలు వెండి పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ ఆర్.శివ వెల్లడించారు. ఈ విభాగంలో నితీష్‌కు కాంస్య పతకం లభించిందని చెప్పారు. వీరిని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతి తదితరులు వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయం వద్ద అభినందించారు.

బీజేడీ నాయకుల సంబరాలు


బండారు ఘరణి మందిరం వద్ద బీజేడీ కార్యకర్తల సంబరాలు

కొరాపుట్: ఝార్సుగుడ ఉప ఎన్నికలో అధికార పార్టీ బీజూ జనతాదళ్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని బండారు ఘరణి మందిరం వద్ద నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. శనివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు, వాహనదారులకు మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ జెండాలతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కౌశల్య ప్రధాన్, తపస్ త్రిపాఠి, భిమొ హరిజన్, ప్రమెద్‌కుమార్ రథొ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మెయిన్ రోడ్డుపై బాణసంచా కాల్చుతున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

రాయగడ: జిల్లావ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణవీధి లోని కోదండ రామాలయం ప్రాంగణంలో హనుమాన్ మందిరం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు అనంతశర్మ ఆధ్వర్యంలో జరిపిన సహస్ర కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే స్థానిక బాలాజీనగర్ వేంకటేశ్వర మందిరంలో విశేష పూజలు జరిగారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: స్థానిక కోమటి వీధిలోని వేంకటేశ్వర ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని హనుమాన్ మందిరంలో ప్రధానార్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు, భద్రం చక్రధర్ ప్రత్యేక పూజలు జరిపగా.. భక్తులు హనుమాన్ చాలిసా పఠించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.


పర్లాకిమిడి: ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సీహెచ్‌సీకి డయేరియా కేసుల తాకిడి


ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న డయేరియా రోగులు

బాడంగి: స్థానిక కమ్యూనిటీ ప్రభుత్వాస్పత్రికి రెండురోజులుగా డయేరియా రోగుల తాకిడి పెరుగుతోంది. ఆస్పత్రిలో 30పడకలే ఉండగా రోగుల సంఖ్యపెరిగిపోతుండడంతో గదులుచాలక ఆస్పత్రి వరండాలో మంచాలు, బెంచీలపై రోగులకు చికిత్స చేస్తున్నారు.ఆదివారం ఆస్పత్రిలో చికిత్సపొందిన వారిలో బొత్స జానకి(రామచంద్రాపురం), వెంపడాపు ఆదెమ్మ (బాడంగి), పి.చంటి (కోడూరు),లచ్చుపతుల తిరుపతి (వీరసాగరం), కొల్లూరి ముగడమ్మ (పిన్నవలస)వెంపడాపు సీతయ్య(రావివలస), కె.సుభాషిణి (లక్ష్మీపురం) మరికొంతమంది ఉన్నారు. ఇదేవిషయమై డాక్టర్ రాజారమేష్ వద్ద ప్రస్తావించగా వేసికాలం ఎండలు ముదిరిపోగా పెళ్లిళ్లు, పండగల భోజనాలు, బావులు, బోర్లలో అడుగంటిన నీరు తాగడంవల్ల విరోచనాలు ఎక్కువగా అవుతున్నట్లు చెప్పారు. కావున ప్రజలు వేసవిలో క్యాంపులు, మసాలాహారాలు తగ్గించుకోవాలని, గంజి, మజ్జిగవంటి పలుచని పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

డ్రాగన్ పండు.. ఔషధ గుణాలు మెండు

- మార్కెట్‌లో మోజు..పెరుగుతున్న సాగు


ఎర్రగా, నల్లని గింజలతో డ్రాగన్ పండు లోపలిభాగం


ఎల్.కోట మండలం, కిత్తన్నపేట తోట వద్ద అమ్మకానికి తరలించేందుకు సిద్ధం చేసిన డ్రాగన్ పండ్లు


తోటలో కోత దశకు చేరువలో ఉన్న డ్రాగన్ పండ్లు

కొత్తవలస: విదేశాల్లో సంపన్నులు తినే డ్రాగన్‌ఫ్రూట్‌ను చూడడమే అరుదు. అలాంటి పంటను జిల్లాలోని లక్కవరపుకోట, బొండపల్లి, డెంకాడ, శృంగవరపుకోట మండలాల్లో ఔత్సాహిక రైతులు చేపట్టారు. సంప్రదాయ పంటలకు భిన్నంగా యువ రైతులు వాణిజ్య పండ్ల తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పండ్లతోటల సాగుతో పాటు మార్కెటింగ్ వ్యూహాన్ని పసిగట్టి, ఆర్థికంగా వెసులుబాటు ఉన్న రైతులు డ్రాగన్‌ఫ్రూట్ సాగు వైపు రావాలని జిల్లా ఉద్యాన వన శాఖ జాయింట్ డైరెక్టర్ జమదగ్ని పిలుపునిచ్చారు. డ్రాగన్‌ఫ్రూట్ పండ్ల తోటల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు, లాభాలను ఆర్జించవచ్చన్నారు. 'డ్రాగన్ ఫ్రూట్' సాగు గురించి ఆయన 'సాక్షి'తో మాట్లాడిని వివరాలు ఆయన మాటల్లోనే.. డ్రాగన్‌ఫ్రూట్‌ను తెలుగులో సిరి జమ్మెడ చెట్టు అంటారు. ఇది ఎడారి జాతికి చెందిన పండ్ల మొక్క. ఈ పండులో అనేక ఔషధగుణాలు ఉన్నాయి. ఈ పండులో శరీరానికి అవసరమైన యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. ఈ పండును తినడం ద్వారా బరువు నియంత్రణ, ఆస్తమా, చెడు కొలెస్ట్రాల్ తగ్గటం, డయాబెటిస్ నియంత్రణ లాంటి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి.

అన్ని రకాల నేలలు అనుకూలం..

డ్రాగన్‌ఫ్రూట్‌ను పండించేందుకు అన్ని రకాలైన నేలలు అనుకూలం. ముఖ్యంగా మంచి సేంద్రియ కర్బనంతో కూడిన ఇసుక నేలలు మరింత శ్రేష్ఠం. ఈ పంటకు నీటి అవసరం చాలా తక్కువ. పూత, కాయ సమయాల్లో 3-4 తడులు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

20 సంవత్సరాల వరకు పంట దిగుబడి..

ఈపంట ఒకసారి నాటితే 20 సంవత్సరాల వరకు దిగుబడిని ఇస్తుంది. స్తంభానికి నలు దిక్కులా 2 అడుగుల పొడవు, వెడల్పు, 1 అడుగు లోతు గుంతలు తవ్వాలి. గుంతకు 25 కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి వేసి మొక్కలు నాటాలి. నేలను బట్టి, సాగు చేసిన రకాలను బట్టి తడులను ఇవ్వాలి. నీరు ఎక్కువైతే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంది. సంవత్సరంలో రెండు సార్లు (జూన్/జనవరి) పశువుల ఎరువు వేసి సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. సాధారణంగా డ్రాగన్ మొక్కలు తొలి కాపు కాయడానికి రెండు నుంచి మూడు సంవత్సరాల సమయం పడుతుంది. డ్రాగన్ సాగుకు ఎకరాకి రూ.3లక్షల నుంచి రూ.4 లక్షలు ఖర్చు అవుతుంది. ఎకరాకు దిగుబడి 6-8 టన్నుల వరకు వస్తుంది. ప్రస్తుత మార్కెట్‌లో డ్రాగన్‌ఫ్రూట్ కేజీ ధర రూ.150 నుంచి 200 వరకు పలుకుతోందని ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ జమదగ్ని వివరించారు.


పూత దశలో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్ తోట


డ్రాగన్‌ఫ్రూట్ సాగును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారులు


సంతపేట జంక్షన్ వద్ద డ్రాగన్ ఫ్రూట్‌లను అమ్ముతున్న రైతు

ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నాం



ఎస్.కోట మండలంలో తొలిసారిగా ప్రయోగాత్మకంగా డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నాం. ప్రస్తుతం ఎకరా విస్తీర్ణంలో సాగు చేపట్టాం. పంట ఆశాజనకంగా ఎదుగుతోంది. ఉద్యానవన శాఖ సూచనలు, సలహాలు తీసుకుంటున్నాం.

- ఆదారి నాగేష, రైతు.ఎస్.కోట.

జిల్లాలో ప్రోత్సహిస్తున్నాం

జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నేలలు డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ప్రస్తుతం నాలుగు మండలాల్లో సాగు చేస్తున్నారు. డ్రాగన్ సాగు చేస్తామన్న రైతాంగానికి కావాల్సిన సూచనలు, సలహాలు అందిస్తున్నాం. సాంకేతిక నైపుణ్యాన్ని ఇస్తున్నాం.

- ఏపీఎస్.జమదగ్ని, జిల్లా ఉద్యానవనశాఖ జాయింట్ డైరెక్టర్.

క్లుప్తంగా

జాబ్‌మేళా రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎస్‌డీటీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయిశ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో, బలగ రోడ్డు వద్ద ఉన్న నెహ్రూ యువ కేంద్రంలో ఈ ఇంటర్వ్యూలు ఉదయం పది గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు లింక్ ఆర్‌బీ.జీవై/టీ94ఎంటీలో రిజిస్టర్ చేసుకోవాలని, పూర్తి వివరాలు కోసం ఫోన్ నంబర్లు 8317652552, 6301045132 ను సంప్రదించాలని సూచించారు. జయబిహారి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఇంటర్, డిగ్రీ అర్హతకు 15, మెకానికల్ డిప్లమాకు 5, ఐటీఐ, మెకానికల్ డిప్లమాలో 5, డిగ్రీకి ఐదు పోస్టులు ఉన్నాయని అన్నారు. డిగ్రీ పోస్టులకు మహిళలు సైతం అర్హులని తెలిపారు. వేతనం నెలకు రూ. 11000 నుంచి రూ.20,000 మధ్య లభిస్తుందని, శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. 20 నుంచి 38 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని తెలిపారు. నాగార్జున అగ్రి కెం పరిశ్రమ నిర్వహించే ఇంటర్వ్యూలకు కనీస అర్హత బీఎస్సీలో కెమిస్ట్రీ సబ్జెక్టు ఉండాలని అన్నారు. పురుషుల అభ్యర్థులు మాత్రమే అర్హులు కాగా, 25 పోస్టులకు రిక్రూట్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. రూ.16903 వేతనం లభిస్తుందని అన్నారు. ఎస్‌ఏ సీఎల్ అరిణాం అక్కివలస ప్లాంట్‌లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. 20 నుంచి 27 మధ్య వయస్సువారు అర్హులుగా చెప్పారు. విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కాశీబుగ్గ ఎస్‌ఐకు గాయాలు


రోడ్డు పక్కన గాయాలతో ఎస్‌ఐ గోపాలకృష్ణ

కాశీబుగ్గ/టెక్కలి రూరల్: కాశీబుగ్గ ఎస్‌ఐ కుంచి గోపాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. నందిగాం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఆయన పల్సర్ బైకుపై కాశీబుగ్గ నుంచి టెక్కలి ఓలేసాగరానికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఘటనలో ఆయన గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న 1033 నేషనల్ హైవే అంబులెన్సు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఎస్‌ఐని టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళకు..

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురం గ్రామంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాల వద్ద ట్రాక్టర్ ఢీకొని బొడ్డాపు దాలమ్మ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాలమ్మ కోటబొమ్మాళిలోని బజార్‌కు వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఆమెను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆమె రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు.

విద్యార్థినిపై అభినందనల జల్లు

సోంపేట: ఉద్దానం తీర ప్రాంత విద్యార్థులు టెన్త్‌లో అత్యధిక మార్కులు తెచ్చుకున్న ఇందును ఆదర్శంగా తీసుకోవాలని వేదం ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. తీర ప్రాంత గ్రామమైన వంకలూరు గ్రామానికి చెందిన కె.ధనరాజు, భానుమతిల కుమార్తె ఇందు ఇటీవల పదో తరగతి ఫలితాల్లో 590 మార్కులు సాధించింది. వేదం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంకలూరులో విద్యార్థినికి రూ.10 వేలు నగదు బహుమతితో పాటు, జ్ఞాపికను అందజేసి అభినందించారు.

చోరీకి పాల్పడిన యువకుడి గుర్తింపు

శ్రీకాకుళం క్రైమ్ : బైక్‌ల చోరీకి పాల్పడిన యువకుడిని గుర్తించి పట్టుకున్నట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ మొజ్జాడ ప్రవల్లిక చెప్పారు. ఆమదాలవలస మండలం తిప్పేవలస గ్రామానికి చెందిన గేదెల సూర్యనారాయణ (37) శ్రీకాకుళం పట్టణ పరిధిలో రెండు ద్విచక్రవాహనాలను గతంలో దొంగతనం చేసినట్లు పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా తెలుసుకున్నారు. ఆదివారం అరసవిల్లి సమీపంలో ఈయన అనుమానంగా తచ్చాడుతుండటంతో మాటువేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి నుంచి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

అరసవల్లికి పోటెత్తిన భక్తజనం

అరసవల్లి: వైశాఖ మాసం ఆఖరి ఆదివారం కావడంతో అరసవల్లి ఆదిత్యుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూ డా భారీగా భక్తులు తరలివచ్చి సూర్యనారాయణ స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. వైశాఖ ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంత భక్తులు పుష్కరిణి ఒడ్డున సంప్రదాయ ప్రసాదాల నివేదన పూజలు చేయగా, మరికొందరు తలనీలాలను మొక్కులుగా స్వామికి చెల్లించుకున్నారు. ప్రత్యేక వైశాఖం సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఇప్పి లి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అలంకరణలతో ఆదిత్యుని మూలవిరాట్టును సిద్ధం చేసి భక్తులకు సర్వదర్శనాలకు అవకాశమిచ్చారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ సూచ నల మేరకు ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు వేసవి సందర్భంగా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

ఫిష్ వ్యాపారం జోష్



ఉప్పు చేపా పప్పుచారు, కొరమీను కోమలం.. అంటూ కవుల రచనలనూ ఘుమ ఘుమలాడించిన చేపల వంటకాలు ఇష్టపడని వారెవరు ఉంటారు. పులుసు, ఇగురు, వేపుడు.. ఇలా పలురకాలుగా ఇవి మన జిహ్వా చాపల్యాన్ని తీరుస్తుంటాయి. గతంలో మత్స్యకారులకే పరిమితమైన చేపల వ్యాపారం, సంప్రదాయ డిష్లకే పరిమితమైన చేపల వంటకాలు కొత్త దారులు వెతుక్కుంటూ తమ పరిధిని విస్తరించుకుంటున్నాయి. మాంసాహారుల జిహ్వాచాపల్యం తీరుస్తున్న చేపల వ్యాపారం కొత్తపుంతలు తొక్కుతూ కోట్ల ఆదాయం కురిపిస్తోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి కల్పిస్తోంది. -శ్రీకాకుళం డెస్క్

- కొత్త కొత్త రుచులతో ఊరిస్తున్న చేప
- ఆదివారాల్లో రూ. అరకోటి టర్నోవర్
- ప్రధాన కూడళ్లన్నింటా అందుబాటులోకి..

పిత్తపరిగెల పులుసు తింటే ఆ రుచే వేరప్పా.. మరి ఇసుక దొంతెల ఇగురు.. వంజరం వేపుడు.. అబ్బో వింటూంటేనే నోరూరిపోతోందా..! రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం అందుకే నాన్‌వెజ్ ప్రియులు చేపలు ఆరగించేందుకు మక్కువ చూపుతున్నారు. భోజన ప్రియుల అభిరుచులకు తగ్గట్టుగానే రెస్టారెంట్ల నిర్వాహకులు స్పెషల్ డిషెస్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. ఆదివారం వస్తే చాలు ఏకంగా జిల్లా వ్యాప్తంగా అరకోటి వరకు చేపల వ్యాపారం జరుగుతోందంటే చేపలకున్న డిమాండ్ వేరే చెప్పనక్కర్లేదు.



ఫ్రెష్‌గా ఫిష్..

నాగవళిలో నదిలో లభ్యమయ్యే చేపలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇలా వలేయడం.. చిక్కిన చేపల్ని వెంటనే విక్రయించడం చకచకా జరిగిపోతుంటాయి. కొన్ని సార్లయితే చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులు వచ్చే వరకు కూడా వినియోగదారులు వెయిట్ చేస్తుంటారు. ఇసుక దొంతలు, మిట్టలు, పిత్తపరిగలు, బొమ్మిడాలు, మార్పులు వంటి చేపల రకాలు నదిలో తాజాగా లభ్యమవుతున్నాయి.

లైవ్‌లో ఫిష్..

పెద్ద వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి అందులో చేపల్ని వేసి విక్రయిస్తున్నారు. ఈ దుకాణాలకు లైవ్‌ఫిష్ అని పేరుపెట్టారు. మనకు ఏ సైజ్‌లో కావాలంటే ఆ సైజ్‌లో ట్యాంక్‌లో నుంచి తీసి ఇస్తున్నారు. వీటి కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సింహద్వారం సమీపంలో.. ఫరీద్‌పేట జంక్షన్‌లో ఈ లైవ్‌ఫిష్ కౌంటర్లు ఉన్నాయి. సమీప ప్రాంతాల్లోని చెరువుల నుంచి ఇక్కడకు చేపల్ని తరలించి ఈ ట్యాంక్‌లలో వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. శనివారం మినహా మిగతా రోజుల్లో ఈ కౌంటర్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.



పొలుసు తీసి.. శుభ్రం చేసి..

నచ్చిన చేపల్ని ఇష్టంగా కొనుగోలు చేస్తాం. కానీ పొలుసు తీసి.. వాటిని శుభ్రం చేసి.. అందులో వ్యర్థాల్ని తీసేసి వంటకు సిద్ధం చేయడం పెద్ద పని. ఆ పనికి మేమున్నాం అంటూ కొందరు మహిళలు కొనుగోలు కేంద్రాలకు సమీపంలోనే అందుబాటులో ఉంటున్నారు. వారు చేపల సంఖ్యను బట్టి చార్జీ చేస్తున్నారు. ఇలా నగర వ్యాప్తంగా 100 మంది వరకు ఉపాధి పొందుతున్నారు.



నగరంలో చేపల విక్రయాలు ఇక్కడే..

- కొత్త బ్రిడ్జిపైన.. ప్రారంభంలో..
- పాతబస్టాండ్ లోపల
- ఏడు రోడ్ల కూడలి సమీపంలోని చెట్టు కింద
- 80 ఫీట్‌రోడ్ ప్రారంభంలో
- బలగ కూడలిలో..
- తోటపాలెం జంక్షన్ సమీపంలో..
- అరసవల్లి ఊరి ప్రారంభంలో..
- ఫరీద్‌పేట జంక్షన్ సమీపంలో లైవ్‌ఫిష్
- సింహద్వారం సమీపంలో లైవ్‌ఫిష్
- జిల్లా పరిషత్ సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీ ఎదురుగా..
- పెద్దపాడు రోడ్‌లోని రైతు బజార్ దగ్గర





సిక్కోలు హాట్‌ఫేవరెట్..

నగరంలోని రెస్టారెంట్లలో కూడా ఫిష్ డిష్‌ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. తందూరీ డిష్‌లలో కూడా మత్స్యరాజం వచ్చి చేరింది. తందూరీ వంజరం, తందూరీ చందువ పేరు చెబితేనే భోజన ప్రి యులు నోరూరిపోతోంది. ఇక అరటాకు లో చేపను పెట్టి వడ్డించే పత్రానీ కామచ్చీ రుచికి సిక్కోలు వాసులు ఫిదా అవుతున్నారని ప్రముఖ రెస్టారెంట్ నిర్వాహకులు గోవర్ధన్ చెప్పారు. ఫిష్ బిర్యానీ కూడా లొట్టలేసుకుని ఆరగిస్తున్నారన్నారు.

ఒక చోట కిలోలు.. మరో చోట వంతులు..



మార్కెట్‌లు, లైవ్ ఫిష్ కేంద్రాల వద్ద చేపల్ని కిలోల లెక్కన విక్రయిస్తుంటే కొత్త బ్రిడ్జి మీద మాత్రం వంతుల వారీగా అమ్మకం చేస్తున్నారు. వలకు చిక్కిన చేపల్ని ఏదానికవి వేరు చేసి వాటాలు వేస్తున్నారు. వాటా ధర చేపల రకాన్ని బట్టి రూ.100కే లభ్యమవుతోంది.

ఆ టేస్టే వేరు..




నాన్‌వెజ్ అంటే చాలా ఇష్టం. అందులో చేపలంటే మరీను. లైవ్ ఫిష్‌కే ప్రాధాన్యమిస్తాను. ఆరోగ్యానికి మంచిది కూడా. పులుసు వండితే లొట్టలేసుకుంటూ తింటా.
– కలగ వెంకట్ బాబు, పెదపాడు



జిల్లా వ్యాప్తంగా రెస్టారెంట్లలో రోజువారీ చేపల వాడకం:	15 టన్నులు
జిల్లా వ్యాప్తంగా రోజువారీ రెస్టారెంట్లలో చేపల వంటకాల వ్యాపారం:	రూ.5 లక్షలు
జిల్లా వ్యాప్తంగా రోజువారీ చేపల వ్యాపారం(అంచనా):	రూ.20 లక్షలు
జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే చేపల వ్యాపారం(అంచనా):	రూ.50 లక్షలు

ధరలు (కిలోల్లో) ఇలా..

వంజరం	రూ.400 నుంచి రూ.600
కోణెం	రూ.650 నుంచి రూ.800
బొచ్చు	రూ.150
ఏటి చందువ	రూ.130
సముద్రం చందువ	రూ.900 నుంచి రూ.1200
కోరమీను	రూ.400 నుంచి రూ.450
రొయ్యలు (సైజును బట్టి)	రూ.250 నుంచి రూ.450
టైగర్‌ప్రాన్	రూ.800 నుంచి రూ.1000



భూసారం పెంపుతో అధిక దిగుబడి

మందస: భూసారం పెంపుతో అధిక దిగుబడి సాధించవచ్చని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని గిరిజన ప్రాంతమైన చీపిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గిరిజన రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ వ్యవసాయంలో యాంత్రీకరణ అవసరమన్నారు. పంటమార్పిడి చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని, దీంతో కాలుష్య రహిత పంటలు పండుతాయన్నారు. చిరుధాన్యాల పంటలు పండించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో కషాయాల తయారీతో పంటలు పండిస్తుండడం అభినందనీయమన్నారు. ఇదే పద్ధతి మరిన్ని ఎకరాలకు విస్తరించాలని సూచించారు. మిలెట్స్ పంటలతో భూసారం పెరుగుతుందని, రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యానవన అసిస్టెంట్లు సూచనలు, సలహాలతో రైతులు పంటలు పండిస్తే అధిక దిగుబడి, తక్కువ పెట్టుబడి సాధ్యపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, వ్యవసాయాధికారి జి. నాగరాజు, ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు గుంట మురళీ, విశ్వనాథం, లక్ష్మణరావు, ఐసీఆర్పీలు సవర బాలకృష్ణ, దీనబంధు, జయలక్ష్మి, కరుణ, శ్రీను పాల్గొన్నారు.


గిరిజనులకు రైతులు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



సెలవులొచ్చాయి..

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం నుంచి జూన్ 4 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు రెండు రోజుల నుంచి ఇళ్లకు వెళ్తున్నారు. విద్యార్థినులను తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, వారు వచ్చిన తర్వాత పంపిస్తున్నారు.

జై భజరంగ భళి


హనుమద్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆంజనేయుని ఆలయాలు సందడిగా మారాయి. సిందూర అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు జరిగాయి. ఈ సందర్భంగా పలు చోట్ల అన్నదానాలు చేశారు. తండ్యాలపేటలో ఇలా అలంకరించారు. – గార

కొత్త గురువులకు సాధన

- జిల్లాలో నూతనంగా నియాకమైన 845 మంది టీచర్లకు శిక్షణ
- నేటి నుంచి మొదలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్న జిల్లా విద్యాశాఖ


కౌన్సెలింగ్‌లో 1998 డీఎస్సీ టీచర్లు, అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులకు శిక్షణ అందించేందుకు విద్యాశాఖ సమాయత్తమవుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతనంగా విధుల్లోకి చేరిన టీచర్లకు ఆరంభ శిక్షణను అందించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. విద్యాశాఖలో ఉపాధ్యాయులుగా చేరిన టీచర్లకు ఆరంభ శిక్షణను అందిస్తుండటం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా నూతనంగా విధుల్లో చేరిన 845 మంది ఉపాధ్యాయులకు ఈ నెల 15 నుంచి ఆరంభ శిక్షణను అందించేలా జిల్లా విద్యాశాఖ పకడ్బందీగా చర్యలు తీసుకుంటుంది.

మూడు కేంద్రాలు.. మూడు విడతలు

మూడు విడతల్లో అందించనున్న శిక్షణను జిల్లా వ్యాప్తంగా మూడు కేంద్రాలుగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. 1998 డీఎస్సీ వారు 330 మంది, 2008 డీఎస్సీవారు 111 మంది, 2018 డీఎస్సీవారు 404 మంది టీచర్లకు ఈ శిక్షణను అందించనున్నారు. ఇందులో డైట్ వమ్మరవల్లిలో 292 మందికి, పాలకొండ తమ్మినాయుడు పాఠశాలలో 248 మందికి, కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 305 మందికి శిక్షణను అందించనున్నారు. మూడు విడతల్లో భాగంగా మొదటి విడత ఈనెల 15 నుంచి మొదలుకానుండగా, రెండో విడత ఈనెల 22 నుంచి, మూడో విడత ఈనెల 29 నుంచి మొదలుకానుంది. ఒక్కో విడతలో ఐదేసి రోజుల చొప్పున నిష్ణాతులైన నిపుణులు, రిసోర్స్ పర్సన్లతో శిక్షణను అందజేసేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

విధిగా రిపోర్టు చేయాలి

ఆయా కేంద్రాలకు కేటాయించిన ఉపాధ్యాయులు నిర్దేశించిన విడతల్లో విధిగా హాజరై రిపోర్ట్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య స్పష్టంచేశారు. గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శిక్షణా కాలంలో భోజన సదుపాయం కల్పిస్తూ నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9493576778, 7382772820 నంబర్లను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు వేళాయె

- మళ్లీ పాత విధానంలోనే ఇంటర్ అడ్మిషన్లు
- నేటి నుంచి జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో మొదలుకానున్న దరఖాస్తుల విక్రయం
- రెండు విడతలుగా ప్రవేశాల నిర్వహణ


జిల్లాలోని కొయ్యాం ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లపై చర్చిస్తున్న ప్రిన్సిపాల్ తవిటినాయుడు, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు వేళయ్యింది. ఇప్పటికే పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. వీరంతా ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది కూడా మళ్లీ పాత పద్ధతిలోనే ఇంటర్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో కాకుండా కళాశాలల్లోనే నేరుగా దరఖాస్తుల విక్రయం, దరఖాస్తుల స్వీకరణ, ప్రవేశాల ప్రక్రియను చేపట్టనున్నారు. కళాశాలల్లో దరఖాస్తుల విక్రయంతోపాటు అడ్మిషన్లు చేసే ప్రక్రియ సోమవారం నుంచి మొదలుకానుంది. ఇప్పటికే ఇంటర్ బోర్డు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇప్పటికే రెమేడియల్ క్లాసుల పేరిట ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు కళాశాల బాట పట్టిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

30 మండలాలతో కూడిన శ్రీకాకుళం జిల్లాలో మొత్తం అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు 191 ఉన్నాయి. వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 168 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్‌వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్‌స్కూల్/కళాశాలలు13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్‌స్కూల్ కాలేజీలు 5, కోపరేటివ్ 2, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 73 ఉన్నాయి. ప్రతి చోట 88 మందితో ఒక సెక్షన్ ఏర్పాటుకు అనుమతిచ్చారు. కళాశాల సామర్థ్యం బట్టి 4 నుంచి 9 వరకు సెక్షన్లు ఉన్నాయి. ఇంటర్మీడియెట్ సాధారణ కోర్సులు అందించే కళాశాలలు 168 ఉండగా వాటిలో 24 కళాశాలల్లో వృత్తివిద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. దాదాపు అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఐసీ కోర్సులున్నాయి. పదో తరగతి విద్యార్థులు మొత్తం 28,724 మంది పరీక్షలు రాయగా ఉత్తీర్ణులైన విద్యార్థులు 24,279 మంది ఉన్నారు. ఫెయిలైన 4445 మంది విద్యార్థులు సెకెండ్ ఫేజ్ అడ్మిషన్లలో చేరనున్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ, ఇతర వృత్తివిద్యా కోర్సులకు వెళ్లే విద్యార్థులు ఏటా సగటున 3వేల మంది వరకు ఉంటారు. వీరు మినహా మిగతా వారంతా ఇంటర్ చదవడానికే మొగ్గుచూపిస్తున్నారు.

పారదర్శకంగా సీట్ల భర్తీ..

ప్రతిభ కలిగిన విద్యార్థులకు అన్యాయం జరగకుండా రోస్టర్ ప్రాతిపదికగా ఇంటర్మీడియెట్ సీట్లను అత్యంత పారదర్శకంగా భర్తీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. పదో తరగతిలో వచ్చిన గ్రేడ్ పాయింట్లు, రిజర్వేషన్లను బట్టి సీట్లను కేటాయించనున్నారు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 29 శాతం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు 3శాతం, ఎన్‌సీసీ, క్రీడా కోటా 5 శాతం, ఎక్స్ సర్వీస్ మెన్, డిఫెన్స్ కోటా కింద 3 శాతం, ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం, మిగిలిన సీట్లు ఇతరులకు కేటాయిస్తారు. దరఖాస్తుల విక్రయ ప్రక్రియ ఈనెల 15న మొదలుకానుంది. దరఖాస్తుల స్వీకరణకు, ఫస్ట్‌ఫేజ్ అడ్మిషన్లకు జూన్ 14తో గడువు ముగుస్తుంది. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు జూన్ ఒకటి నుంచి తరగతులు మొదలుకానున్నాయి. గత ఏడాది కంటే ఫీజులు పది శాతం పెరిగాయి.

అంగరంగ వైభవం.. అమ్మవారి ఉత్సవం


స్వేచ్ఛావతి అమ్మవారి తిరువీధిలో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి తిరువీధిలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సైకత శిల్పాలు అందరికీ ఆకట్టుకుంటున్నాయి
ఇచ్ఛాపురం


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సైతక శిల్పం

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి

శ్రీకాకుళం అర్బన్: ఏపీ పీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషిచేస్తానని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆదివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని శ్రీకాకుళం-1, 2 డిపోలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఆర్‌పీఎస్ 2017 ఎరియర్స్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ చెల్లింపులు, ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా వచ్చే సర్వీస్ కండీషన్స్, కారుణ్య నియామకాలు, రిటైర్ అయిన ఉద్యోగులకు చెల్లింపులు తదితరవి ప్రభు త్వం ద్వారా వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు.